క్లుప్తంగా

నాగారం వాసికి ఎల్ఎల్ఎం పట్టా



ఎల్ఎల్ఎం పట్టా అందుకుంటున్న కడియం నివేదిత

నాగారం: మండల కేంద్రానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కడియం ఇందిరా పరమేశ్వర్ కుమార్తె కడియం నివేదిత హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం పూర్తి చేసింది. శనివారం నిర్వహించిన నల్సార్ యూనివర్సిటీ 22వ స్నాతకోత్సవంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. నరసింహ, సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఆమె ఎల్ఎల్ఎం పట్టా అందుకున్నారు. నివేదిత ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తోంది.

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేఖ

సూర్యాపేటటౌన్ : ఈ నెల 14న తిరుమలగిరిలో జరగనున్న సీఎం రేవంత్‌రెడ్డి సభ సందర్భంగా వచ్చే మహిళల భద్రతకు పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బోయలపల్లి రేఖ కోరారు. శనివారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కె.నరసింహను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి హాజరయ్యే మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కార్యకర్తల రాకపోకలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళల భద్రత, రవాణా, ప్రాంగణంలో సమన్వయం వంటి అంశాలపై పోలీస్ విభాగం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సభ ప్రదేశంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ విభాగం పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళా కాంగ్రెస్ తరఫున పోలీస్ శాఖకు పూర్తిస్థాయి సహకారం అందిస్తామన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

సూర్యాపేట : ప్రభుత్వం ఐకేపీ వీఓఏలకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంపటి గురుజీ కోరారు. సూర్యాపేట పట్టణంలోని రైస్ మిల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీవీఏల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కన్నం శారద, జిల్లా ఉపాధ్యక్షులు నర్సింగ్ నాయక్, జిల్లా కోశాధికారి ఉమాదేవి, యూనియన్ నాయకులు నాగమణి, సైదమ్మ నిర్మల, ఝాన్సీ, లీలావతి, శైలజ, ఇందిర, పద్మ పాల్గొన్నారు.

డీవీ, టీఎన్‌లకు నివాళి

చివ్వెంల : ప్రజలు ఐకమత్యంగా పోరాడి మౌలిక మార్పులకు కృషి చేయాలని భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం (యూసీసీఆర్-ఎంఎల్) రాష్ట్ర నాయకుడు పోలెబోయిన ముత్తయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామానికి చెందిన భారత విప్లవ పంథా నిర్మాతలు దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు (డీవీ), తరిమెల నాగిరెడ్డి (టీఎన్)ల సంస్మరణ సభను అక్కలదేవిగూడెంలో నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డీవీ, టీఎన్‌లు విద్యార్థి దశ నుంచే అభ్యుదయ భావాలకు ఆకర్షితులై ప్రజల కోసం, సాయుధ రైతాంగం తరఫున పోరాటాలు జరిపారని తెలిపారు. అనంతరం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లగొండ వెంకన్న, సుంక రమేష్, గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి కొనకంచి భద్రయ్య, ఉప్పల మల్లయ్య, ముప్పాని లింగారెడ్డి, పాలకూరి యల్లయ్య, తండు మల్సూర్ తదితరుల పాల్గొన్నారు.

కళాశాల వార్షికోత్సవం


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

చివ్వెంల : మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ శివారులోని ప్రతిష్ఠ ఫార్మసీ కళాశాలలో శనివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీ ఫార్మసీ తృతీయ సంవత్సరం విద్యార్థులు, నాలుగవ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు పలికారు. అనంతరం ఆటా-పాటల ద్వారా అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపల్ డాక్టర్ కిశోర్ బాబు, వైస్ చైర్మన్ డాక్టర్ కార్తీక్, హెచ్‌ఓడీ డాక్టర్ శాంతి, డాక్టర్ జుబైర్ తదితరులు పాల్గొన్నారు.

హరితప్రేమికులు.. ఆదర్శణీయులు

- పుట్టినరోజు మొక్కలు నాటుతూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు
- స్వీట్లు వద్దు.. చెట్లు ముద్దు అనే నినాదంతో ప్రోత్సహిస్తున్న పీడీ మల్లేష్

అర్వపల్లి : ఒకప్పుడు ముళ్లపొదలు, కంపచెట్లతో నిండిన అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్ ఇప్పుడు పచ్చదనంతో కళకళలాడుతోంది. ఈ అద్భుతమైన మార్పునకు కారణం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి. మల్లేష్. ఆయన పీడీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, పాఠశాల రూపురేఖలే మారిపోయాయి. మల్లేష్ పీడీగా కేవలం వ్యాయామ విద్యకే పరిమితం కాకుండా, పర్యావరణ పరిరక్షణకు తనదైన శైలిలో కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన చేపట్టిన వినూత్న కార్యక్రమం 'స్వీట్లు, కేకులు వద్దు.. చెట్లు ముద్దు'. ఈ కార్యక్రమం కింద, పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎవరి పుట్టినరోజు వచ్చినా కేకులు, స్వీట్లు పంచే బదులు, తమ చేతుల తో మొక్కలు నాటుతున్నారు. ఈ వినూత్న కార్యక్రమం వల్ల పాఠశాల ఆవరణలో ఇప్పటివరకు 100కు పైగా మొక్కలు నాటారు. వాటి సంరక్షణను కూడా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.


అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న పీడీ మల్లేష్


అర్వపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణకు జట్లుగా ఏర్పడి..

పాఠశాలలో యూత్, ఎకో క్లబ్‌ల ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు అనేక జట్లను ఏర్పాటు చేశారు. నీటి నిర్వహణ, భూమి నిర్వహణ, జీవ వైవిధ్య నిర్వహణ, వ్యర్థ పదార్థాల నిర్వహణ, శక్తి నిర్వహణకు సంబంధించి వేర్వేరుగా జట్లను ఏర్పాటు చేశారు. వారంతా పాఠశాల ఆవరణలో పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ జట్ల సభ్యులు నీటిని పొదుపుగా వాడటం, భూమిని సారవంతం చేయడం, జీవవైవిధ్యాన్ని కాపాడటం, శక్తి వనరులను పొదుపుగా వాడటం వంటి అనేక కార్యక్రమాలను చేపడుతున్నారు. పీడీ మల్లేష్ కృషి, నాయకత్వం వల్ల అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్ ఇప్పుడు కేవలం విద్యాకేంద్రంగానే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు ఆదర్శంగా నిలుస్తోంది.

పచ్చదనంగా మార్చడమే లక్ష్యం



అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు తాను పీడీగా వచ్చాక పాఠశాలను పచ్చదనంగా మార్చడానికి ఎంతో కృషి చేస్తున్నాను. స్వీట్లు వద్దు.. చెట్లు ముద్దు అనే నినాదాన్ని తెచ్చి పిల్లలు, ఉపాధ్యాయుల జన్మదినం రోజున వారిచేత మొక్కలు నాటేలా చేస్తున్నాం. ఇప్పటివరకు పాఠశాలలో 100కు పైగా మొక్కలు నాటాం. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం వివిధ రకాల జట్లను ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాం.

- పి.మల్లేష్, పీడీ

బడిని హరితవనంగా మార్చిన వీరయ్య

ఆత్మకూర్(ఎస్) : ఖాళీ జాగా కనపడితే చాలు, ఏదో ఒక మొక్క నాటి దాన్ని సంరక్షించడం తన కిష్టమని చెబుతారు తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన పిడమర్తి వీరయ్య. మొక్కల పెంపకంపై తనకున్న మక్కువతో గ్రామంలో పలు చోట్ల, ముఖ్యంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటిని పెంచి గ్రామస్తులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కొద్దికాలం క్రితం వీరయ్య ఇదే గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పార్ట్ టైం అటెండర్‌గా పనిచేశారు. ఆ సమయంలో గ్రామంలో కొత్తగా ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయబడింది. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సంకల్పించిన వీరయ్య, ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వేప, జామాయిల్, కానుగు చెట్లను వరుస క్రమంలో నాటారు. వాటిని ఎంతో శ్రద్ధగా సంరక్షించారు. నేడు ఆ మొక్కలు పెరిగి పెద్ద వృక్షాలయ్యాయి.

విద్యార్థులకు, గ్రామస్తులకు ప్రయోజనం..


పిడమర్తి వీరయ్య

ఈ చెట్ల నీడలో విద్యార్థులు చదువుకోవడంతో పాటు ఆడుకుంటున్నారు. అంతేకాకుండా, గ్రామస్తులు చిన్న చిన్న సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి కూడా ఈ చెట్ల నీడ ఎంతో ఉపయోగపడుతోంది. పాఠశాలకు వచ్చిన ప్రతి ఒక్కరూ వీరయ్య చేసిన ఈ పనిని చూసి ప్రశంసిస్తున్నారు, అభినందిస్తున్నారు. కేవలం పాఠశాల ఆవరణలోనే కాకుండా, గ్రామంలోని పలు ఇతర ప్రాంతాల్లోనూ మొక్కలు నాటి, తనకు మొక్కల పెంపకంపై ఉన్న మక్కువను చాటుకుంటున్నారు వీరయ్య.


పాఠశాల ఆవరణలో భారీగా పెరిగిన చెట్లు

వీరయ్య చేస్తున్న ఈ పని పర్యావరణ పరిరక్షణకు, భవిష్యత్ తరాలకు స్ఫూర్తి దాయకంగా నిలుస్తోంది. ఆయన కృషిని ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరూ మొక్కలు నాటా లని, పచ్చదనాన్ని పెంపొందించాలని ఆశిద్దాం.

అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

తిరుమలగిరి: తుంగతుర్తి నియోజకవర్గంలో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే గొప్పలు చెబుతున్నారని, ఈ అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి నియోజకవర్గంలో అడుగు పెట్టే అర్హత లేదని విమర్శించారు. ఎమ్మెల్యే మందుల సామేల్ సొంత గ్రామం ధర్మారం, మంత్రి సొంత గ్రామమైన తాటిపాముల, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సొంత గ్రామం శాలిగౌరారంలో రైతు రుణమాఫీ, రైతుబంధు, కల్యాణలక్ష్మి పథకాలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని అన్నారు. ఆ మూడు గ్రామాల్లో అన్ని పథకాలు అమలైనట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని అన్నారు. ఒక వేళ అమలుకానట్లు తేలితే వారు తమ పదవులకు రాజీనామా చేస్తారా అని సవాల్ విసిరారు. ఈ విషయంపై బహిరంగ విచారణ జరపాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పథకాలకే ఇప్పుడున్న ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేస్తూ కొబ్బరి కాయలు కొడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో మండలశాఖ అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, ఎస్ఏ రజాక్, తాటికొండ సీతయ్య, ప్రభాకర్‌రెడ్డి, గుండగాని అంబయ్య, ఉపేందర్, భాస్కర్, కల్లెట్లపల్లి శోభన్‌బాబు, సురేందర్, వై.రవీందర్, కందుకూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు సుధాబ్యాంక్ ఎండీ సన్మాన సభ


మాట్లాడుతున్న మీలా మహాదేవ్, ఆహ్వాన కమిటీ సభ్యులు

సూర్యాపేట : పట్టణంలోని త్రివేణి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించే సుధా బ్యాంక్ ఎండీ పెద్దిరెడ్డి గణేష్ సన్మానం, అభినందన సభను విజయవంతం చేయాలని సుధాకర్ పీవీసీ ఎండీ, సుధాబ్యాంకు చైర్మన్ మీలా మహాదేవ్ అన్నారు. శనివారం సుధా బ్యాంకులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దిరెడ్డి గణేష్ గత 20 సంవత్సరాలుగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అనేక మంది కళాకారులను సూర్యాపేటకు తీసుకొచ్చి త్యాగరాయ ఆరాధన ఉత్సవాలు నిర్వహించారని అన్నారు. అటువంటి వ్యక్తికి ఎన్టీఆర్ స్మారక అవార్డు రావడం హర్షణీయమని, ఆయనను సన్మానించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. సన్మాన కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ సభ్యులు పెద్దిరెడ్డి రాజా, కక్కిరేణి చంద్రశేఖర్, తోట శ్యాం ప్రసాద్, అప్పం శ్రీనివాసరావు, మిన్న శివరామకృష్ణ, తికుళ్ల సాయిరెడ్డి, ఇరిగి కోటేశ్వరి, బొలిశెట్టి మధు, తోట సత్యనారాయణ, గాలి శ్రీనివాస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ముసుగులో వేలకోట్ల సంపాదన

- వట్టే జానయ్య యాదవ్


మాట్లాడుతున్న వట్టే జానయ్యయాదవ్

సూర్యాపేట : అభివృద్ధి ముసుగులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి వేలకోట్లు సంపాదించారని రాష్ట్ర బీసీ జేఏసీ సమన్వయ కర్త వట్టే జానయ్య యాదవ్ ఆరోపించారు. శనివారం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారి జగదీష్ రెడ్డే అని, వెంటనే ప్రభుత్వం అతడి శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ మీద రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ఈ నెల 14న వాంగ్మూలం ఇవ్వాలని సమాచారం ఇచ్చిందని, ఆ రోజు అన్ని ఆధారాలు సిట్‌కు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అన్నెపర్తి రాజేష్, కుంభం నాగరాజు, వల్లాల సైదులు యాదవ్, కుంభం వెంకన్న, మీర్ అక్బర్, సుంకరబోయిన రాజు, బొల్లె సైదులు, పెద్దబోయిన జానకిరాములు, ఆవుల అంజయ్య యాదవ్, సూపర్ సైదులు, ఉప్పల మల్లయ్య, కడంపెల్ల చంద్రయ్య, లింగాల సైదులు, నాగరాజు పాల్గొన్నారు.

పూర్వమిత్ర మండలి ఆధ్వర్యంలో తరగతులు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మల్లికార్జున్

సూర్యాపేట : పట్టణంలోని 32వ వార్డులో సూర్యాపేట పూర్వ విద్యార్థి మిత్రమండలి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి బయ్య మల్లికార్జున్ మాట్లాడారు. నేటి విద్యార్థి లోకం సెల్, టీవీ ప్రపంచంలో మునిగిపోయి బంగారు భవిష్యత్తును ఆగం చేసుకుంటుందని అన్నారు. చదువుల్లో బట్టీ పట్టే పద్ధతి చేపట్టి శాస్త్రీయతను, లోక పరిజ్ఞానాన్ని కోల్పోతున్నారని వాపోయారు. విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం విద్యార్థుల చేతుల్లోనే ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు సట్టు వెంకన్న, తల్లాడ రామచంద్రయ్య, సన్నీ, కన్నా, అశ్విత్ రెడ్డి, విక్రమ్, ధ్రువ కాంత్, ఆదిత్య, అమోగ్ పాల్గొన్నారు.

హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ అమలు చేయాలి


నిరసన తెలుపుతున్న నాయకులు

భానుపురి : హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ అమలుపై వెంటనే ప్రకటన చేయాలని, లేదంటే ఈ నెల 14న తిరుమలగిరిలో జరిగే సీఎం సభను అడ్డుకుంటామని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు అన్నారు. శనివారం స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద తెలంగాణ యువజన సంఘం ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థి, నిరుద్యోగ యువతకు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించాలని, బాసరలోని ట్రిపుల్ ఐటీ తరహాలో నూతనంగా నాలుగు ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసి గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. యూత్ కమిషన్ ఏర్పాటు చేసి యువతకు రూ.10లక్షల వరకు వడ్డీ లేని రుణ సదుపాయం కల్పించాలని అన్నారు. ఖాళీగా ఉన్న సుమారు 2లక్షల ఉద్యోగాల పోస్టుల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు భాషివంగు సునీల్, ఏనిగా సంతోష్ రెడ్డి, పంతం యాకయ్య, తెలంగాణ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పోరెళ్ల విప్లవ్ కుమార్, జిల్లా నాయకులు ధరావత్ శివ నాయక్, చెరుకు నగేష్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


రామచంద్రపురంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అన్నెపర్తి జ్ఞానసుందర్

మద్దిరాల : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్ అన్నారు. శనివారం రామచంద్రపురంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. అనంతరం గ్రామంలో స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు అంగిరేకుల వెంకన్న, నాయకులు ఉబ్బని జాన్, వెంకటనారాయణ, వెలుగు వీరన్న, ఉబ్బని ఏసు, వెలుగు అంజమ్మ, వల్లపు ఎల్లమ్మ, జి.పద్మ పాల్గొన్నారు.

14న జిల్లా కేంద్రంలో పింఛన్‌దారుల సదస్సు


పెన్‌పహాడ్ : మాట్లాడుతున్న గిద్దె రాజేష్


ఆత్మకూర్ (ఎస్) : మాట్లాడుతున్న గడ్డం కాశీం

పెన్‌పహాడ్: ఈ నెల 14న సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగే చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రూ. 6వేల పింఛన్, వికలాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాల భర్తీ హామీలు అమలుచేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం ఖాసీం, మండల అధ్యక్షుడు పేర్ల సోమయ్య, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత సతీష్, గుండు శ్రీనివాస్, గార్లపాటి వెంకట్‌రెడ్డి, హుస్సేన్‌బీ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): ఈ నెల 14న సూర్యాపేట జిల్లా కేంద్రంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి గడ్డం కాశీం కోరారు. శనివారం ఆత్మకూర్ మండల కేంద్రంలో మండల ఇన్‌చార్జి బండి మల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వికలాంగుల పెన్షన్ రూ.4016నుంచి రూ. 6016కు పెంచాలని, ఆసరా పెన్షన్‌దారులైన వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులకు రూ.2016 నుంచి రూ. 4016లకు పెంచాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సుకు మంద కృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చింత సతీష్, భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. డి. జహీర్ బాబా, సీనియర్ నాయకులు కొప్పుల కళింగ రెడ్డి, తిప్పర్తి భిక్షం, దారమళ్ల నగేష్, నాయకులు పగి డోజు జానకి రాములు, తదితరులు పాల్గొన్నారు.

దొడ్డ నారాయణరావు మృతి తీరనిలోటు


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేట అర్బన్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు దొడ్డ నారాయణరావు మృతి పార్టీకి తీరనిలోటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బూర వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పట్టణంలోని ధర్మభిక్షం భవన్‌లో నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడిన కమ్యూనిస్టు నాయకుడు దొడ్డ నారాయణరావు అని అన్నారు. ఉమ్మడి నల్లగొండ సీపీఐ జిల్లా కార్యదర్శిగా, నల్లగొండ వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శిగా, ఎంపీపీగా, సర్పంచ్‌గా ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, దొరపల్లి శంకర్, దోరేపల్లి శంకర్, గుగులోతు రాజారామ్, నిమ్మల ప్రభాకర్, రేగటి లింగయ్య, దీకొండ శ్రీనివాస్, ఎండీ పాషా, ఖమ్మంపాటి అంతయ్య, బూర సైదులు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

నూతనకల్: నూతనకల్ మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన జెన్నారెడ్డి దేశ్‌ముఖ్‌ల వద్ద భూమిని కొనుగోలు చేసిన రైతులకు పట్టాలు మంజూరు చేయాలని అన్నారు. నూతనకల్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల, ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30పడకల ఆసుపత్రిగా మార్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దేసోజు మధు, మున్నా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి


తుంగతుర్తి : మాట్లాడుతున్న శ్రీకాంత్

తుంగతుర్తి : తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గం అన్ని రంగాలలో వెనుకబడిందని తెలిపారు. ఈ నెల 14న నిర్వహించే సీఎం సభలో నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ప్రకటించాలని అన్నారు. సాగునీటి రంగంలో వారబందీ విధానాన్ని రద్దుచేసి రైతులకు నిత్యం సాగునీరు అందించేలా కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వృత్తి విద్యా కళాశాల ఏర్పాటు చేయాలని, తుంగతుర్తిలోని 100 పడకల ఆస్పత్రికి పూర్తి నిధులు కేటా యించాలని, నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని రేషన్ కార్డులు ఇచ్చినా ప్రజలకు బియ్యం ఉచితంగా ఇచ్చేది మాత్రం కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వమే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నారాయణదాసు నాగరాజు, గాజుల మహేందర్, మండల ప్రధాన కార్యదర్శి సంక నాయక్, శ్రీనివాస్, సాయికృష్ణ పాల్గొన్నారు.

రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి..

తాటిచెట్ల పైనుంచి పడి మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందడం లేదని రాష్ట్ర విద్యార్థి సంఘం నాయకుడు మొల్కపురి శ్రీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కొత్తగూడెంలో గీత కార్మిక సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి గీత కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని అన్నారు. తిరుమలగిరిలో 14న జరిగే రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో గీత కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షలు ఇవ్వకుంటే సీఎం సభను అడ్డుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిత్తలూరి కృష్ణమూర్తి, గౌడ సంక్షేమ సంఘం నాయకులు వగలగాని వెంకన్న, వర్దెల్లి లింగయ్య, సైదులు, భద్రం, అశోక్, కంట్లం, ఉప్పలయ్య, మల్లయ్య, రాము పాల్గొన్నారు.

తిరుమలగిరిలో బస్ డిపో ఏర్పాటు చేయాలి

తిరుమలగిరి : ఈ నెల 14న జరిగే బహిరంగ సభలో తిరుమలగిరిలో బస్ డిపో ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేయాలని బస్ డిపో సాధన కమిటీ కన్వీనర్ కడెం లింగయ్య కోరారు. శనివారం తిరుమలగిరిలో ఆయన మాట్లాడారు. బస్ డిపో సాధన కోసం మంత్రులకు, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. తిరుమలగిరిలో డిపో ఏర్పాటు చేయడం వల్ల చుట్టుపక్కల ప్రాంత ప్రయాణికులకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. ఆయన వెంట కమిటీ సభ్యులు పాషా, వేల్పుల లింగయ్య, చిలుకల రమేష్, నలుగూరి రమేష్, సోమయ్య, లక్ష్మయ్య, రాములు, హన్మంతు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి బీఎన్ పేరు పెట్టాలి

అర్వపల్లి : ఎస్సారెస్పీ రెండో దశకు మాజీ ఎంపీ, తెలంగాణ సాయుధ పోరాటయోధుడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలని శనివారం అర్వపల్లిలో పూలే-అంబేద్కర్ ఆశయ పోరాటసమితి సభ్యులు కోరారు. బీఎన్ కృషి ఫలితంగానే గోదావరి జలాలు ఈ ప్రాంతానికి వచ్చాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి తిరుమలగిరి సభకు వస్తున్నందున ఆ రోజు ఎస్సారెస్పీ రెండోదశకు బీఎన్ పేరు పెట్టేలా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య, నక్కల సురేందర్, నర్సింహ, వెంకన్న, వెంకటమ్మ, కృష్ణయ్య, వెంకట్రాములు, రమ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

తిరుమలగిరి : తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. శనివారం ఆయన తిరుమలగిరిలో మాట్లాడారు. నియోజకవర్గానికి అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయడానికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్‌పై మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. నియోజకవర్గంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇసుక దందా, భూ దందాలే సాగాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గంలో ఏ ఒక్కరికైనా తెల్ల కార్డు వచ్చిందా.. అని ప్రశ్నించారు. ఎక్కడా లేని విధంగా రేషన్ కార్డుపై సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని తెలిపారు.

క్షయవ్యాధి నిర్ధారణ శిబిరం

అర్వపల్లి : క్షయ రహిత సమాజం కోసం పాటుపడాలని మండల వైద్యాధికారి డాక్టర్ బి.నగేష్‌నాయక్ కోరారు. కాసర్లపహాడ్‌లో శనివారం క్షయవ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. 20 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీబీ నిర్మూలన నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, ఎల్‌టీ చొక్కయ్య, ఎంఎల్‌హెచ్‌పీ పి.గౌతమి, హెల్త్ అసిస్టెంట్ శ్వేత పాల్గొన్నారు.